ప్రజాశక్తి

సోమవారం 27 అక్టోబరు, 2025



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రతి సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 28వ తేదీన రద్దు చేసినట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు మొంథా తుపాను సన్నాహక కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అర్జీదారులు వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని సూచించారు.

బోటును ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు



అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలి : మంత్రి



కోటబొమ్మాళి : మొంథా తుపాను నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తుపాను ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి శాఖ, ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని నిర్దేశించారు. చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నీటి సరఫరా విభాగం అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

'మొంథా' గుబులు

- జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తుపానుతో అన్నదాతల్లో ఆందోళన
- అధికారులతో జిల్లా ప్రత్యేకాధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారింది. వాయుగుండం మొంథా తుపానుగా మారి జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతల్లో గుబులు రేగుతోంది. తుపాను ప్రభావం తీర ప్రాంత జిల్లాలపై ఉండనుందన్న వార్తలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. జిల్లాలో కొన్నిచోట్ల కోతలు ప్రారంభమైన నేపథ్యంలో తుపాను హెచ్చరికలు రావడంతో రైతులు పొలాలకు పరుగులు పెడుతున్నారు. కోత పూర్తయిన ధాన్యాన్ని పొలాల నుంచి కళ్లాలకు తరలిస్తున్నారు. మొంథా తీవ్ర తుపాను కావడంతో గాలులకు పంట నేలవాలుతుందన్న భయం వెంటాడుతోంది. పంట చేతికొచ్చే సమయంలో తుపాను హెచ్చరికలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

'మొంథా'పై అధికారులు అప్రమత్తం

'మొంథా'గా నామకరణం చేసిన తుపానుపై ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలోని 19 తీర ప్రాంత జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా జిల్లాకు ప్రత్యేకాధికారిగా కె.వి.ఎన్ చక్రధర్‌బాబును నియమించింది. తుపానుపై అధికారులను అప్రమత్తం చేసేందుకు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంతో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రైతులు పంటలు జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. తీరప్రాంత మండలాల్లో మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా తహశీల్దార్లు గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. మత్స్యకారులు బోట్లు, వలలు, పడవలను జాగ్రత్తపరుచుకోవాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. మంగళవారం నుంచి ఉరుములతో కూడిన జల్లులు అనేకచోట్ల కురిసే అవకాశముందన్నారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కొన్నిచోట్ల పడే అవకాశం ఉందని చెప్పారు. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురుగాలులు 45 నుంచి 55 కిలోమీటర్ల నుంచి గరిష్ఠంగా 65 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని చెప్పారు. బుధవారం నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉరుములతో కూడిన జల్లులు చాలాచోట్ల కురిసే అవకాశముందన్నారు. గరిష్ఠంగా 80 కిలోమీటర్లు క్రమంగా 90-100 కి.మీ కొన్నిచోట్ల 110 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించారు. ఈ తుపాను జిల్లాపై 28, 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపవచ్చన్నారు. తుపాను ప్రభావిత పరిస్థితిని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 29 వరకు మత్స్యకారులు ఎవరూ సముద్రంలోనికి వేటకు వెళ్లరాదని, సముద్రం లోపల ఉన్న వారు వెంటనే తీరానికి చేరుకోవాలన్నారు. వరి పంట కోత దశలో ఉన్నట్లయితే, ఈ నాలుగు రోజులు కోతలు కోయరాదని తెలిపారు. ఇప్పటికే వరి కోతలు పూర్తయి పొలాల్లో ఉన్న చేనును కళ్లాలకు చేర్చడం గానీ పంటను సంరక్షించే చర్యలు చేపట్టాలని కోరారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అత్యవసర సమయంలో 08942- 240557 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. మండల కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకోవాలని తహశీల్దార్లకు సూచించారు. తుపాను గాలుల సమయంలో ఎవరూ బయటకు రాకూదని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండొద్దని చెప్పారు. వైద్యారోగ్య, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, రహదారులు భవనాలశాఖల అధికారులు, సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అధికారులు అవసరమైన మందులను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 108 వాహనాలు అన్ని మండలాల్లో సిద్ధంగా ఉన్నాయని, అత్యవసర సమయంలో వినియోగించుకోవాలని సూచించారు.

తుపాను నేపథ్యంలో ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు జిల్లాకు చేరుకున్నాయి. మరోవైపు తీర ప్రాంత, లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లను అధికారులను చేస్తున్నారు. తీర ప్రాంత మండలాల్లో అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి జనరేటర్లు, డీజిల్, తాగునీరు తదిత ర వాటిని సిద్ధం చేస్తున్నారు. తుపాను తీవ్రత దృష్ట్యా సహాయక చర్యల్లో అందుబాటులో ఉండేం దుకు ఉద్యోగులకు సెలవులను రద్దు చేశారు.



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఉద్ఘాటన

ప్రజాశక్తి - అరసవల్లి

వైద్య కళాశాలలు, ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని పలువురు వక్తలు స్పష్టం చేశారు. 'పిపిపి విధానంలో మెడికల్ కళాశాలలు' అనే అంశంపై నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ అగేంతవరకు అందరం ఉద్యమించాలని , ప్రభుత్వ వైద్య కళాశాలల రక్షణకు జెవివి చేస్తున్న కషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మేధావులు రౌండ్ టేబుల్ సమావేశంలో కోరారు. పౌరులకు వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్మించి, నిర్వహించాల్సిన ప్రభుత్వ వైద్య కళాశాలలను 590 జిఒతో పిపిపి విధానంలోకి మార్చడం ప్రజల హక్కులను కాలరాయడమేనన్నారు. వైద్య కళాశాలల్లో వైద్య విద్యను పొందడమే కాకుండా ప్రతి వైద్య కళాశాలకు అనుబంధంగా 420 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉండడంతో ఆయా ప్రాంతాలలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఉచిత వైద్య సదుపాయాలు పొందవచ్చని తెలిపారు. వైద్య కళాశాలలు, ఆస్పత్రుల ప్రైవేటీకరణ వల్ల ఈ అవకాశాన్ని పేద ప్రజలు కోల్పోతారన్నారు. గతంలో మంజూరైన 17 వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను ప్రైవేటీకరించే చర్యలను ప్రభుత్వం ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యను, ఆరోగ్యాన్ని అంగడి సరుకుగా మార్చే ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, వైద్య కళాశాలల నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం చేపట్టాలన్నారు. రాష్ట్ర జిడిపిలో ఐదు శాతం నిధులు వైద్య రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలలు, ప్రజారోగ్య సంస్థలను కాపాడుకోవడానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ప్రముఖులతో సంతకాల సేకరణ నిర్వహించాలని, పోస్టర్లతో విస్తృతంగా ప్రజానీకాన్ని చైతన్యపరచాలని, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆగేంత వరకు ఉద్యమించాలని సమావేశంలో తీర్మానించారు. జెవివి జిల్లా అధ్యక్షులు గొంటి గిరిధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ కె.శ్రీనివాస్ (ప్రజారోగ్య వేదిక), ప్రొఫెసర్ విష్ణుమూర్తి, నల్లి ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, (జెవివి), పి.తేజేశ్వరరావు (సిఐటియు), బి.శ్రీరామ్మూర్తి (యుటిఎఫ్), కె.శ్రీనివాసు (సాహితీ స్రవంతి), బి.ధనుంజయరావు (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంఎస్), పలు సంఘాల నాయకులు బోనెల రమేష్, బొడ్డేపల్లి మోహనరావు, మిస్క కృష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వికలాంగుల జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయం ప్రాంగణంలో వికలాంగుల కోసం ఈనెల 27న ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ట్రెండ్స్, బిపిసిఎల్, యూత్ ఫర్ జాబ్స్ వంటి పలు ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 50 వరకు ఉద్యోగ నియామకాలు చేపడతాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదివిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులని తెలిపారు. రాష్ట్రంలోని పలు పట్టణాల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఉదయం తొమ్మిది గంటలకు జాబ్‌మేళా ప్రాంగణానికి రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182943285 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.



గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్న నాయకులు

నేడు థర్మల్ వ్యతిరేక ధర్నా

ప్రజాశక్తి - బూర్జ

థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలని, అక్రమ సర్వేను నిరసిస్తూ సరుబుజ్జిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మహా ధర్నా చేపట్టనున్నట్లు థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, ఆదివాసీ వికాస పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని అడ్డూరిపేట, బొమ్మికపేట, తిమడాం, వెన్నెలవలస, చిగురువలస తదితరి గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ సర్వేలు చేసి ఆదివాసీలు, రైతుల మనోభావాలను దెబ్బతీయవద్దన్నారు. పవర్‌ప్లాంట్ వల్ల పర్యావరణానికి, మానవాళి మనుగడకు ప్రమాదం ఉందన్నారు. సరుబుజ్జిలి, బూర్జ మండల కేంద్రాలు కూడా దీని వల్ల ప్రమాదంలో పడతాయని చెప్పారు. ప్రమాదకరమైన ప్లాంట్ ప్రతిపాదన ఆపాలని కోరుతూ ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యాన చేపడుతున్న ధర్నాకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ధర్నా అనంతరం సరుబుజ్జిలి తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ కార్యదర్శి సింహాచలం, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, మిన్నారావు, బాబూరావు, రమేష్, సవర ధర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐబిఎం శాస్త్రవేత్త రితజిత్ మజుందార్

సాంకేతిక విజ్ఞానానికి 'క్వాంటమ్' మైలురాయి

ఐబిఎం శాస్త్రవేత్త రితజిత్ మజుందార్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

క్వాంటమ్ ద్వారా మనం ప్రపంచంలో అనేక మార్పులను తీసుకురాగలమని ఐబిఎం శాస్త్రవేత్త డాక్టర్ రితజిత్ మజూందర్ ఉద్ఘాటించారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆరో రోజులుగా నిర్వహిస్తున్న క్విస్కిట్ ఫాల్ ఉత్సవంలో భాగంగా ఆదివారం 'క్వాంటమ్ ఆల్గోరిథమ్స్'పై ప్రేరణాత్మక సెషన్ నిర్వహించారు. క్వాంటమ్ సాంకేతిక విజ్ఞానానికి మరొక మైలురాయి కావడమే, విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. క్వాంటమ్ సూత్రాల ప్రయోగాత్మక అన్వయాలు, భవిష్యత్ సాంకేతికతలో వాటి పాత్ర గురించి వివరిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆసక్తిని పెంచారు. దీనిని డాక్టర్ జ్ఞాన్ యల్లా శ్రీనివాస్, తిలోక్ సాధుఖాన్ నేతృత్వం వహించారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో క్వాంటమ్ సమస్యలపై పరిష్కారాలు ప్రదర్శించారు. ముఖ్యంగా క్విస్కిట్ ప్లాట్‌ఫారంపై ప్రాయోగిక పరిశీలించి క్వాంటమ్ సర్క్యూట్ల రూపకల్పనలో ప్రావీణ్యం అందించారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ సంచాలకులు ఆచార్య కొక్కిరాల వెంకటధన బాలాజీ, సమన్వయకర్తలు పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, కో-ఆర్డినేటర్లు డాక్టర్ రవి గేదెల, సిఎస్ఇ విభాగపతి రమేష్ పాల్గొన్నారు. క్వాంటమ్ శాస్త్ర రంగంలో యువతకు ప్రేరణగా సాఫల్యంగా ముగిసింది.

ప్రాణ నష్టం లేకుండా పనిచేయాలి

జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రాణ నష్టం సున్నా లక్ష్యంగా పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 'గోల్డెన్ అవర్'ను ఏ అధికారి వృథా చేయకుండా మెరుగైన సేవలందించడానికి అందుబాటులో ఉండాలని జిల్లా ప్రత్యేక అధికారి కె.వి.ఎన్. చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. మొంథా తీవ్ర తుపాను నేపథ్యంలో కలెక్టరేట్‌లో అధికారులతో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిత్లీ తుపాను అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు

తుపానును ఎదుర్కోవడంలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, సురక్షితం కాని ఇళ్లలోని ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని ప్రత్యేకాధికారి సూచించారు. గర్భిణులు, తీవ్రమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారికి పోషకాహార మద్దతు ఇచ్చి, వారి భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్ సిబ్బంది దేనికైనా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ సిబ్బంది కూలిన చెట్లను తొలగించడానికి ట్రీ కట్టర్లు డీజిల్ నిల్వలు సిద్ధం చేసుకుని, తక్షణ స్పందనకు సిద్ధంగా ఉండాలన్నారు.

సహాయక చర్యల కోసం రేషన్ దుకాణాలకు పిడిఎస్ బియ్యాన్ని వీలైనంత త్వరగా పంపాలని చక్రధర్ బాబు ఆదేశించారు. ప్రత్యేక శిబిరాల్లో వంట, పాలు ఇతర అవసరాలు సిద్ధం చేయాలని సూచించారు. రైతులు పొలాల్లో నీరు నిలవకుండా చూసుకుని, పంట నష్టం తగ్గించాలన్నారు. అత్యవసర మందులు సిద్ధం చేసుకోవాలని, వర్షాల తర్వాత పారిశుధ్యం సవాల్‌గా మారుతుందని, వ్యాధులు ప్రబలకుండా చూడడానికి సిబ్బందిని సంసిద్ధం చేయాలన్నారు. మత్స్యకారుల వలలు బోట్లు, చేనేత మగ్గాలు వంటి ఆస్తులకు నష్టం జరగకుండా దృష్టిసారించాలన్నారు. రాబోయే మూడు రోజులు ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, సెల్ ఫోన్ ఆపరేటర్లు విద్యుత్ సరఫరా వ్యవస్థ సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, అధికారుల సూచనలను తప్పక పాటించాలని చక్రధరబాబు కోరారు. ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లపై జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్, ఎస్‌పిలు ఆయనకు వివరించారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

శ్రీకాకుళం సిటీ : నిరుద్యోగ యువతకు విదేశీ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఐఇఎస్ సంస్థల సహకారంతో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 31న ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్న విదేశీ ఉద్యోగ అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. రెండేళ్ల ఐటిఐ గానీ మూడేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఉత్తీర్ణ, గరిష్ఠంగా 30 ఏళ్ల వయసు, కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.2.60 లక్షలు నుంచి 2.70 లక్షల జీతం లభిస్తుందని స్పష్టం చేశారు. రెండేళ్ల ఒప్పందం మేరకు అదనపు పనికి అదనపు వేతనం, వసతి, అరైవల్ సహాయం వంటి సౌకర్యాలు యజమానులు అందిస్తారని వెల్లడించారు. అభ్యర్థులకు జర్మన్ భాషలో 12, 14 వారాల శిక్షణ రాజమండ్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజుకు ఎనిమిది గంటల క్లాస్‌రూం శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ ఫీజు రూ.1.15 లక్షలు మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు నవంబర్ రెండో తేదీ లోగా apssdc.in వెబ్‌సైట్‌లో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182943285 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

వలసల నివారణే లక్ష్యం

- అర్హులందరికీ జాబ్‌కార్డులు
- కచ్చితంగా వంద రోజుల పని
- డ్వామా పీడీ బి.సుధాకరరావు





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణే లక్ష్యంగా ఉపాధి హామీ చట్టం అమలు చేస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు చెప్పారు. రాష్ట్రంలో ఉపాధి హామీ అమలులో ఏటా మొదటి మూడు స్థానాల్లో ఉంటున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పనులను ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? ఉపాధి హామీ అమలు తీరు ఎలా ఉంది?

ఉపాధి హామీ రాష్ట్రంలో జిల్లాకు సంబంధించి మొదటి మూడు స్థానాల్లో ప్రతి సంవత్సరమూ ఉంటుంది. కావలసిన వారందరికీ జాబ్ కార్డులు అందజేయటం, కార్డు ఉండి పనికి అవసరమనుకునే ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం. జిల్లాలో 4.37 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. 3.82 లక్షల కుటుంబాలు పనికి హాజరవుతున్నాయి. 7.49 లక్షల వేతన దారులు ఉండగా, 5.95 లక్షల మంది పనికి హాజరవుతున్నారు. కచ్చితంగా 100 రోజులు పని కల్పిస్తున్నాం. నెలల వారి లక్ష్యం మేరకు మాన్ డేస్ పూర్తి చేస్తున్నాం.

? కనీస కూలి వచ్చేలా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

సాంకేతిక సహాయకులు సూచనలు పాటిస్తే గరిష్ఠ కూలి లభిస్తుంది. మేట్లకు శిక్షణ సైతం ఇస్తున్నాం. ప్రధానంగా పని గంటలు, పని కొలత గరిష్ఠ వేతనం నిర్ణయిస్తాయి. జిల్లాలో గరిష్ఠ వేతనం రూ.307 సైతం వస్తుంది. సరాసరి రూ.237 కూలి వస్తుంది.

? కూలీలకు కూలి చెల్లించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పనిచేసిన తొమ్మిది రోజుల్లోగా కూలి చేరేలా చర్యలు తీసుకుంటున్నాం. రోజువారి పని కొలతలు తీసుకోవడం, కంప్యూటర్‌లో కూలీల పేర్లు అప్‌లోడ్ చేస్తున్నాం. సిబ్బంది సైతం జాప్యం లేకుండా కూలి అందించే చర్యలు తీసుకుంటున్నారు.

? మిగతా శాఖల సమన్వయం ఎలా ఉంది?

పంచాయతీరాజ్, పశుసంవర్ధకశాఖ, రోడ్ల భవనాల శాఖ, గిరిజన అభివృద్ధిశాఖ, జల వనరులశాఖ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, విద్యాశాఖ వంటి శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. మెటీరియల్ కాంపోనెంట్‌లో భాగంగా సిమెంట్ రోడ్డు నిర్మాణం, పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం, సాగునీటి కాలువల మరమ్మతులు, గోశాలల నిర్మాణం, వ్యవసాయశాఖ అనుసంధాన పనులు, ఫారం ఫౌంట్లు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తున్నాం.

? ఉపాధి హామీ నిధులు జిల్లాకు మంజూరు ఎలా ఉంది?

నిధులు అవసరానికి మించి మంజూరు అవుతున్నాయి. 96 వేల వరకు ఏడాదిలో పనులు చేస్తున్నాం. రూ.1200 కోట్లు పనులకు అంచనాలు సిద్ధం చేస్తుండగా, రూ.800 కోట్లు పనులు పూర్తి చేయగలుగుతున్నాం. రూ.500 కోట్లు మ్యాన్ పవర్‌కు, రూ.300 కోట్లు నిర్మాణాల మెటీరియల్స్ కోసం ఖర్చు చేస్తున్నాం. భవిష్యత్‌లో పూర్తిస్థాయి నిధులు ఖర్చు లక్ష్యంగా పెట్టుకున్నాం.

? ఎటువంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు?

చెరువులు, కాలువలు ఎర్త్ వర్క్. చెక్ డ్యామ్‌లు వంటి నిర్మాణం. వ్యవసాయ అనుసంధాన పనులు. మొక్కలు నాటడం, పెంపకం, సిమెంట్ రోడ్డు, పనులు నిర్మాణం, వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నాం.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం డిఎస్‌సి వివేకానంద ప్రజలకు సూచించారు. గార మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన బందరువానిపేట, నగరాలపేట, కళింగపట్నంతో పాటు పలుగ్రామాల్లో ఆదివారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న తుపాను షెల్టర్లు పరిస్థితి, అవసరం మేరకు ఏర్పాటు చేయాల్సిన పునరావాస కేంద్రాల కోసం భవనాలు పరిశీలించారు. వర్షాలు, గాలులు, పిడుగులు వంటి పరిస్థితుల్లో ప్రజలు సురక్షిత భవనాల్లో ఉండాలని, మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లవద్దని, సముద్రంలో ఉన్న వారు ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. మంగళ. బుధవారాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా పోలీసు కంట్రోల్ రూం డయల్ 112 లేదా స్థానిక పోలీసు అధికారులను సంప్రదించాలని తెలిపారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ఎట్టిపరిస్థితుల్లో సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని కోరారు. ఈయనతో రూరల్ సిఐ పైడిపునాయుడు, గార ఎస్ఐ గంగరాజు ఉన్నారు.

బూర్జ: మండలంలో నదీతీర ప్రాంతాల్లో ఉన్న గుత్తావల్లి, లాభాం, నారాయణపురం, చిన్న లంకాం, పెద్దలంకాం, కాఖండ్యాం, ఉప్పపేట, వావాం, బూర్జ, అల్లెన, జివిపురం, కిలంతరి, వై.పర్త తదితర నదీతీర ప్రాంతాల గ్రామాల్లో స్థానిక ఎస్ఐ ప్రవల్లిక పర్యటించారు. గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని ఆమె అవగాహన కల్పించారు.


శ్రీకాకుళం సిటీ : తుపాను షెల్టర్లు పరిశీలిస్తున్న డిఎస్‌పి వివేకానంద తదితరులు

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

సంతబొమ్మాళి: తుపాను ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెలాఖరు వరకు తీర ప్రాంత మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లరాదని భావనపాడు మెరైన్ సిఐడి అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా మెరైన్ సిఐడి రాము, ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. అలాగే తుపాను పూర్తిగా తగ్గిన వరకూ భావనపాడు బీచ్‌కు పర్యాటకులు రావద్దని, సముద్రంలో స్నానం చేయకూడదని సూచించారు.


సంతబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న మెరైన్ సిబ్బంది

ఇచ్ఛాపురం: తుపాను కారణంగా మత్సకారులు ఎవ్వరూ సముద్రంలో చేపల వేటకు వెల్లరాదని సిఐ మీసాల చిన్నంనాయడు సూచించారు. ఇచ్ఛాపురం, కవిటి సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులకు అవగాహన కల్పించారు. తపాను తీవ్రంగా ఉందని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

సోంపేట : తుపాను నేపథ్యంలో సోంపేట సిఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి మత్యకారులతో మాట్లాడారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

మెళియాపుట్టి: మండలంలోని అన్ని సచివాలయ ఉద్యోగులు తమ సచివాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, క్లోరినేషన్, తాగునీటి సరఫరా వంటి పనులను సమర్థంగా నిర్వహించాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపానుపై అవగాహన కల్పించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికీ సెలవులు లేవని స్పష్టం చేశారు. మండల స్థాయిలో ప్రత్యేక అధికారులుగా మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపిడిఒ, తహశీల్దార్ పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. మండల ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్ట్యా సచివాలయ సిబ్బంది సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొత్త పింఛన్లకు మోక్షమెప్పుడో?

వితంతు, వికలాంగులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని వరకకు చెందిన ఎన్ని వినాయక రావు అనారోగ్యానికి గురై కాలుకు వ్యాధి సోకింది. తప్పనిసరి పరిస్థితుల్లో అతని కాలు తొలగించాల్సి వచ్చింది. దీనికి తోడు కిడ్నీ వ్యాధి కూడా సోకింది. అప్పటి నుంచి అతనికి కష్టాలు మొదలయ్యాయి. కనీసం పింఛను వచ్చినా మందుల ఖర్చులకయినా అవుతాయనే ఆశతో రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాడు. చివరికి అతని భార్య విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తూ భర్తను పోషిస్తోంది. నెలవంకకు చెందిన ఆనింగి చంద్రమ్మ భర్త చనిపోయి నాలుగేళ్లు దాటింది. ఇప్పటి వరకూ ఆమెకు వితంతు పింఛను మంజూరు కాలేదు. ఇది కేవలం వీరిద్దరి సమస్య మాత్రమే కాదు. జిల్లా వ్యాప్తంగా వేలమంది వితంతు, వికలాంగ, వృద్ధుల సమస్య. పింఛను ఎప్పుడిస్తారయ్యా అంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.


పింఛను కోసం చూస్తున్న వినాయకరావు

కొత్త పింఛన్ల కోసం జిల్లా వ్యాప్తంగా వేలమంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా వితంతువులు, వికలాంగులు పింఛను కోసం పడిగాపులు కాస్తున్నారు. సుమారుగా మూడేళ్ల నుంచి కొత్త పింఛన్లు మంజూరు ప్రక్రియ జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్లు అందిస్తుందని ఎదురుచూసిన వారికి ఇప్పటివరకూ నిరీక్షణే మిగిలింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో వేలకొలది లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చూస్తు న్నారు. ఒక్క కవిటి మండలంలోనే సుమారు 11 వందల కుపైగా లబ్ధిదారులు కొత్త పింఛను కోసం నిరీక్షిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో...

ఇటీవల కూటమి ప్రభుత్వం స్పౌజ్ పేరిట వితంతువులకు పింఛన్లు అందించింది. భర్త పింఛను తీసుకుంటూ మృతి చెందితే ఆ పింఛను భార్యకు బదలాయించారు. అదీ 2019 మార్చి నుంచి 31.10.24 మధ్యలో పింఛను తీసుకుంటూ మృతి చెందిన వ్యక్తుల భార్యలకు మాత్రమే ఈ పింఛన్లు మంజూరు చేశారు. మిగతా వారికి అందులోను నిరాశే మిగిలింది. ఇక కొత్త పింఛన్ల ఊసే ఇంతవరకూ లేదు.

సామాజిక జీవితంలో ఒంటరితనం అనేది ఓ భయంకరమైన అనుభవం. అటువంటిది వితంతువు అనేసరికి ఓ విధమైన సానుభూతి. భర్తనే నమ్ముకుని వచ్చిన స్త్రీ ఆ భర్తనే కోల్పోతే ఆర్థిక ఆసరా కల్పించే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు వితంతు పింఛన్లు ఏర్పాటు చేశాయి. మరోవైపు వికలాంగులు, వృద్ధులు తమ తమ సమస్యల దృష్ట్యా ఎవరిపైనో ఒకరిపై ఆధారపడక తప్పని పరిస్థితి. వారికి ఆర్థిక స్వావలంబన అందించే ప్రయత్నమే ఈ పింఛన్లు. గతంలో పింఛన్ల మంజూరు ప్రక్రియ ఎప్పటికప్పుడు జరిగేది. ఇక వితంతువులకైతే భర్త మృతి చెందిన తరువాత నెల నుంచే పింఛను అందించే ప్రయత్నం చేసేవారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి హయాంలో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. సామాజిక పింఛన్ల మంజూరు ప్రతి ఆరు నెలలకొకసారి మాత్రమే అనే నిబంధన పెట్టడంతో ఎవరి మాట ఎలా ఉన్నా వితంతువులు, వికలాంగులు చాలా మనోవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఎన్నో పథకాలు, మరెన్నో ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వాలు తమ పింఛన్ల మంజూరు విషయంలో చేస్తున్న తాత్సారంపై వితంతువులు పెదవి విరుస్తున్నారు.

ఆ ప్రయత్నంలోనే ఉన్నాం



కొత్త పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించింది. అందులో భాగంగానే ముందుగా స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశాం. వాస్తవానికి పింఛన్ల పంపిణీ, మంజూరు ఒక ప్రక్రియలా ఉండేది. గత ప్రభుత్వంలో చేసిన మార్పులు, తప్పిదాలే ఇప్పటి పింఛను సమస్యలకు కారణం. త్వరలోనే కొత్త పింఛన్లు అందించి మా బాధ్యత మేం నెరవేరుస్తాం.

– బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాం



ప్రస్తుతం నా వయసు 63 ఏళ్లు. అనారోగ్యానికి గురై అనుకోని పరిస్థితుల్లో కాలు తొలగించాల్సి వచ్చింది. అప్పటి నుంచి నాకు సమస్యలు మొదలయ్యాయి. ఇద్దరు పిల్లలు ఉన్నా నేను నా భార్య ఒంటరిగానే ఉంటున్నాం. కనీసం పింఛను వచ్చినా నాకు ఉపాధి లభిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నా.

– దుంప లచ్చయ్య, నెలవంక

వితంతులకు ఇంత నిరీక్షణా..?



మా ఆయన చనిపోయి సుమారు రెండేళ్లు అవుతోంది. ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్న నేను ఆర్థిక ఆసరాకోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. అదే నాకు పింఛను వచ్చే పరిస్థితి ఉంటే నా మందులు, ఖర్చులకు ఇంకొకరిపై ఆధారపడాల్సిన పని ఉండదు. చాలామంది వితంతువులది నాలాంటి పరిస్థితే. సమాజంలో మా సమస్యలు గుర్తించి ఇప్పటికైనా వితంతు అనే మహిళకు నియమ నిబంధనలు లేకుండా ప్రభుత్వాలు పింఛను అందించే ప్రయత్నం చేస్తే నాలాంటి వారికి మేలు జరుగుతుంది. అప్పటికే భర్తను కోల్పోయిన ఆమె పింఛను కోసం ఇంత నిరీక్షణ సరికాదు.

– బిసాయి హైమావతి, వరక

రేపు యువజనోత్సవ పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


శరత్‌బాబు, ప్రిన్సిపాల్

యువతలోని కళాత్మక, సాంస్కృతిక విలువలను ప్రోత్సహించడానికి, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ నెల 28న మండలస్థాయి యువజనిత్సవ పోటీలు నిర్వహిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు తెలిపారు. కలెక్టర్, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండలస్థాయి యువజనోత్సవ పోటీలు ప్రభుత్వ జూనియర్ బాలురు కళాశాలలో నిర్వస్తామన్నారు. ఈ పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థులు పాల్గొవచ్చునని తెలిపారు. ఈ పోటీల భాగంగా ఫోక్ డాన్స్, ఫోక్ సాంగ్, డిక్లమేషన్, స్టోరీ రైటింగ్, పోయెట్రీ రైటింగ్, పెయింటింగ్ వంటి విభాగాల్లో విద్యార్థుల ప్రతిభను అంచనా వేయనున్నారు. ఈ పోటీల్లో చక్కనైన ప్రతిభ కనబరిచి విజేతలైన విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న ఉన్న ఈ నెల 27న ఉదయం 10 గంటల లోపు వివరాలను కళాశాలకు అందజేయాలని సూచించారు.


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాజేష్

రాజేష్ పరామర్శ

కవిటి: జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ ఆదివారం పలువురు బాధితులను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నెలవంక పంచాయతీ వడ్డిపుట్టుగ జనసైనికుడు బిసాయి దుర్యోధన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయ సహకారాలు పార్టీ పెద్దలతో మాట్లాడి అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాపీమేస్త్రి రామ్మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవలే ఆస్పత్రి నుంచి కోలుకొని వచ్చిన రామ్మూర్తి కుమారుడు ప్రణయ్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు హరికృష్ణ బిసాయి, జన సైనికుడు వెంకటేష్, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

బిసి సెల్ సంయుక్త కార్యదర్శిగా దానయ్య


దానయ్య

మందస: రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శిగా ఎంపిపి డొక్కరి దానయ్య ఆదివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అధినేత వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి, మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలపై అప్రమత్తం

పలాస : పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలని చైల్డ్ లైన్ అధికారులు అన్నారు. పలాస రైల్వే స్టేషన్ పరిధిలో ప్లాట్ ఫామ్-2లో రైల్వే ప్రయాణికులకు తప్పిపోయిన, పారిపోయిన, భిక్షాటన చేస్తున్న, అక్రమ రవాణా గురవుతున్న పిల్లల గురించి ఆదివారం అవగాహన కల్పించారు. చైల్డ్ లైన్ సర్వీసెస్ 1098, 139, 182పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది భాగ్యలక్ష్మి, జిఆర్‌పి సిబ్బంది జీవన్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

టెక్కలి రూరల్ : మాజీ సైనికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు నంబాల గోవిందరావు అన్నారు. టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీలో ఉన్న అసోసియేషన్ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలపై చర్చించుకుంటూ అసోసియేషన్ ముందుకు సాగడానికి సూచించారు.

బీల ప్రాంతాన్ని సంరక్షించాలి

ప్రజాశక్తి- సోంపేట

విభిన్న జీవరాశులకు నివాసమైన సోంపేట బీల ప్రాంతాన్ని సంరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పట్నానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు గోపీకృష్ణ, సభ్యులు బెల్లాన సుమన్, క్రాంతి, శ్రీరామ్, వినోద్, పింటూ, శంకర్, సాగర్ తదితరులు ఆదివారం బీల ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మత్స్యకారులు, రైతులతో మాట్లాడి జీవవైవిధ్యం గురించి, నీటి నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో జీవవైవిధ్యంతో పాటు చిత్తడి నేలలుగా ఉన్న బీలను సంరక్షించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సోంపేట జాతీయ రహదారి నుంచి గ్రామంలోనికి వచ్చే అప్రోచ్ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు.


బీల ప్రాంతాన్ని సందర్శిస్తున్న ప్రతినిధులు

ఇండోర్‌లో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సమావేశం



మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ మండోల్కర్ అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘాల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి కొత్త ప్రతిభావంతుల ఎంపిక, జాతీయస్థాయి పోటీలు నిర్వహణ, మహిళా క్రీడాకారిణులకు ప్రోత్సాహం, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రాతినిధ్యం పెంపు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సాఫ్ట్‌బాల్ క్రీడను గ్రామీణ పాఠశాల స్థాయికి విస్తరించే దిశగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగేందుకు మౌలిక సదుపాయాలు, శిక్షణా శిబిరాలు, క్రీడా సామగ్రి అందించేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. భవిష్యత్‌లో ఎపిలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించేందుకు ప్రతిపాదనను సమావేశం ముందు ఉంచారు. ఆయన సూచనలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు ప్రశంసించారు.

భారీ కంటైనర్‌తో అవస్థలు

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండ – శ్రీకాకుళం ప్రధాన రహదారిపై అనునిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వాహనదారులతో పాటు రహదారి పక్కనున్న గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. తాజాగా గత రెండు రోజులుగా శ్రీకాకుళం రోడ్డు నుంచి 100 చక్రాల భారీ కంటైనర్ రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కంటైనర్ విశాఖపట్నం పోర్ట్ నుంచి శ్రీకాకుళం నుంచి పాలకొండ మీదుగా ఒడిశాకు వెళ్తుంది. భారీ కంటైనర్ కావడంతో ఆమదాలవలస నుంచి బూర్జ మండలానికి చేరడానికి 12 రోజులు పట్టింది. దారి పొడుగునా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను, చెట్లను, విద్యుత్ తీగలను తొలిగించుకుంటూ ముందుకు వెళ్తుంది. శుక్రవారం కొల్లివలస వద్దకు చేరుకున్న కంటైనర్ రాకతో వాహనదారులతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం తుడ్డలి గ్రామ సమీపంలో వాహనాన్ని నిలిపివేశారు. భారీ కంటైనర్ కావడంతో విద్యుత్ వైర్లతో పాటు స్తంభాలు కూడా పడిపోయిన పరిస్థితి ఉందని విద్యుత్ శాఖ ఎఇ స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. భారీ వాహనాల రాకపోకలవలన పలు ఇబ్బందులు చోటు చేసుకుంటూన్నాయని, ఇదే విషయాన్ని ఆర్‌అండ్‌బి శాఖ ఎఇ ఆంజనేయ నాయక్ వద్ద ప్రస్తావించగా ఈ రహదారిపై కంటైనర్ వెళ్లేందుకు అనుమతులు తీసుకున్నారని వెల్లడించారు.


భారీ వాహనంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు


పూడిక తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న చైర్మన్ రాంబాబు

పూడికలు తొలగింపు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాల, జూనియర్ కళాశాల సమీపంలో ఆదివారం ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ప్రొక్లెయినర్‌తో సమీపంలోని కాలువల్లో ఎన్నోఏళ్ళుగా పూడికపోయిన పూడికలు తీశారు. ఆ పరిసరాల్లో చెత్త, పెంటకుప్పలు లేకుండా తొలగించారు. పాఠశాల ముఖద్వారం సమీ పంలోను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దొర రాజా రమేష్ తదితరులున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని దేరసాంలో ఆదివారం జిల్లా సేవాభారతి, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్ ఎన్ఎంఒ ఎపి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆరోగ్యంపై చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈశిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ అమర్ కార్తీక్, డాక్టర్ తీడ రాజేశ్వరి, డాక్టర్ సోమిక, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ రఘునాథ్, డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ పి.కీర్తి, పి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

ప్రజాశక్తి- పలాస

చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. చెరువులో స్నానాలు చేసేందుకు వీలు లేకుండాపోయింది. మహిళలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కార్తీక మాసం రావడంతో వేకువజామున నుంచే మహిళలు చెరువులో స్నానాలు, దీపాలు వెలిగిస్తున్నారు. ప్రస్తుతం స్నానాలు, దీపాలు వెలిగించేందుకు అవకాశం లేకపోవడంతో గ్రామానికి చెందిన యువకులు నడుం బిగించారు. చేయి చేయి కలిపి మహిళలు పడుతున్న బాధలను తొలగించేందుకు ముందుకు వచ్చి చెరువులో ఉన్న గుర్రపు డెక్కను శ్రమదానం చేసి తొలగించారు. చెరువు మెట్లు, చెరువులో గుర్రపు డెక్క చెత్త చెదారాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాజీ సభ్యులు గరుగు సింహాచలం, టిడిపి నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ల కృష్ణారావు, ఆళ్ల వెంకటరావు, తామడ మోహనరావు మాట్లాడుతూ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. పదేపదే చెప్పినా పట్టించుకోకపోవడంతో యువత ముందుకు వచ్చి శ్రమదానం చేసి చెరువు శుభ్రం చేశామని చెప్పారు. మరోమారు శ్రమదానం చేసి పూర్తి స్థాయిలో చెరువు శుభ్రం చేస్తామని, ప్రస్తుతం మహిళలకు ఇబ్బంది లేకుండా శుభ్రం చేశామని చెప్పారు. కార్యక్రమంలో గరికి కృష్ణారావు, కొవ్వూరు ధర్మారావు, ఆళ్ల సోమేశ్వరరావు, ఎండ్ల పాపారావు, శివస్వామి, శాసనపురి వెంకట్రావు, బ్రహ్మనీల్, ఆళ్ల ధర్మారావు, బమ్మిడి పాపారావు పాల్గొన్నారు.


గుర్రపుడెక్కను తొలగిస్తున్న యువకులు

సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలి

అరసవల్లి: నవంబర్ 1న మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ భవనంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 30 మండలాల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించబడుతున్నాయని వాటిని ఎంఇఒలు, హెచ్ఎంలు, చెకుముకి మండల కన్వీనర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయవంతం చేయాలన్నారు. నవంబర్ 11 నుంచి 20 వరకు శ్రీకాకుళంలో జరిగే సిక్కోలు పుస్తక మహోత్సవం, జిల్లా సాంస్కృతిక సాహిత్య వైజ్ఞానిక ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవస్థాపక కార్యదర్శి కొత్తకోట అప్పారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, జిల్లా ఉపాధ్యక్షులు పాలకొండ కూర్మారావు, సైన్స్ అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ హనుమంతు మన్మధరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పాలవలస ధర్మారావు, సమత జిల్లా కన్వీనర్ పేడాడ వేదవతి, ఆడిట్ జిల్లా కన్వీనర్ బి. ఉమామహేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

చితికిన చేతివృత్తిదారులు

వలసబాట పడుతున్న వైనం


కుండలు తయారీ చేస్తున్న కుమ్మరి

ప్రజాశక్తి- నందిగాం

కుమ్మరం పురాతన కాలం నుంచి వచ్చింది. మట్టితో కుండల కూజాలు, పాత్రలు తయారు చేసేవారు. ఆధునిక వస్తువుల రాకతో కుమ్మరులు ఉపాధి కోల్పోయారు. కుమ్మరి వృత్తి పురాతన జీవనోపాధనలో ప్రధానమైన వృత్తిగా చూస్తారు. అయితే వీరు ప్రస్తుతం చేతు వృత్తుల ద్వారా తయారు చేసిన పనిముట్లకు గిరాకీ లేకుండాపోయింది. దీంతో ఆ వృని పక్కన పెట్టి హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు వంటి పట్టణాల్లో రోజు కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వృద్ధాలు, వికలాంగులు మాత్రమే గ్రామాల్లో ఉండి చేసిన వృత్తిని వదులుకోలేక నామమాత్రముగా కుండలు తయారు చేస్తూ... ఈ కళకు జీవం పోస్తున్నారే తప్ప వారికి జీవనాధారం కాలేక పోతుందని ఆవేదన చెందుతున్నారు. ప్లాస్టిక్ సిల్వర్ పాత్రలు వాడకం పెరగడంతో మట్టికుండలకు డిమాండ్ తగ్గి కుమ్మరి వృత్తి కనుమరుగయ్యే దశలో ఉంది. కుమ్మరి వృత్తి పురాతన చేతివృత్తుల్లో ప్రధానమైనది. మండలంలోని కాపుతెంబూరు, బెజ్జపల్లె, దిమ్మిడిజోల, నౌగాం గ్రామాల్లో 300 మంది వరకు కుండలు చేస్తూ... జీవనం సాగించేవారు. అయితే ఆధునిక పనిముట్లు అందుబాటులోకి రావడంతో కుమ్మరి బతుకులు ఛిద్రమయ్యాయి చేతివృత్తును నమ్ముకుని చదువుకు దూరమై సమాజంలో గుర్తింపు లేక ఆర్థికంగా వెనుకబడి చివరకు వలసబాట పట్టాల్సి వచ్చిందని పలువురు కుమ్మరి వృత్తిదారులు ఆవేదన చెందుతున్నారు. రోజంతా కష్టించినా కనీసం రూ.వంద కూడా వస్తువుల అమ్మకానికి నోచుకోక ఆర్థికంగా వెనుకబడి పోతున్నామని ఆవేదన చెందారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నా చిన్ననాటి నుండి కుండలను తయారుచేసి సంతల్లో అమ్మకం చేపట్టి తద్వారా వచ్చిన డబ్బులతో తిండి గుడ్డలకు ఇబ్బంది లేకుండా హాయిగా జీవనం సాగించేవారు. అయితే గడిచిన 20 ఏళ్లుగా ఉపాధి కరువై దుర్భర జీవనం అనుభవిస్తున్నాం. పాలకులు చేతివృత్తులను ప్రోత్సహించి రుణాలను మంజూరు చేయించి ఉపాధి కల్పిస్తే వలస పోకుండా వృత్తి ద్వారానే జీవనం సాగించే వీలు ఉంటుంది.

– పోలయ్య, సుభద్ర దంపతులు, కాపుతెంబూరు

30 ఏళ్లగా ఇదే వృత్తి



మట్టి కుండలు తయారు చేసి నందిగాం, గోవిందపురం, డి.జి.పురం సంతల్లో అమ్మకాలు చేపట్టే పోషణ చేసే వాళ్లం. ఇప్పుడు మట్టి కుండలను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. దీంతో చేతివృత్తిని వదులుకుని వలసబాట పట్టాం. సంక్రాంతి, దసరా, వినాయకచవితి వట్టి పండగల సమయంలో ఇంటికి వచ్చినప్పుడు నామమాత్రంగా కుండలు తయారుచేస్తాం. వాటిని ఆ సమయాల్లోనే విక్రయిస్తాం. ధరలు గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నాం.

– రావివలస పద్మ

బావిలో పడి యువకుడు మృతి


రోదిస్తున్న భార్య

కోటబొమ్మాళి : మండలంలోని కోట బొమ్మాళి పంచాయతీ ఉప్పర పేటకు చెందిన దండుపాటి గౌరినాయుడు (32) ఆదివారం బావితో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు మృతుడు మద్యానికి అలవాటు ఉంది. మద్యం సేవించి స్నానానికి బావిలో దిగి మునిగి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు గౌరినాయుడును ఒడ్డుకు తీసుకొచ్చి 108కు, అగ్నిమాపక సిబ్బందికి సమా చారం ఇచ్చారు. 108 సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు చిన్న, కల్పనలు ఉన్నారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వి. సత్యనారాయణ కేసుదర్యాప్తు చేస్తున్నారు.

అబుదాబిలో జిల్లావాసి మృతి


నరసింహారావు (ఫైల్)

కంచిలి: మండలంలోని గెద్దల పాడుకు చెందిన నక్క నరసింహారావు (49) వలస కూలి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి అబుదాబిలో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహారావుకు భార్య నారాయణమ్మ, కుమారులు మాధవ్, నీరజ్ ఉన్నారు. పెద్ద కుమారుడు మానసిక వైకల్యంతో బాధ పడుతున్నాడు. నిరుపేదైన నరసింహారావు అప్పు చేసి నెల రోజుల క్రితం అబుదాబిలో ఎన్‌ఎస్‌హెచ్ కంపెనీలో వెల్డర్‌గా పనికి వెళ్లాడు. బుధవారం సాయంత్రం భార్యకు ఫోన్ చేసి మాట్లాడుతూ కడుపునొప్పిగా ఉందని, ఆస్పత్రికి వెళ్తున్నానని చివరిసారిగా మాట్లాడాడు. శుక్రవారం అర్ధరాత్రి కంపెనీ నుంచి తన భర్త మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని నారాయణమ్మ విలేకరులకు తెలిపింది. నిరుపేదలమైన తమ కుటుంబాన్ని పోషించేందుకు భర్త వలస వెళ్లారని, కడసారి చూపులకు సైతం నోచుకోవడం లేదని కన్నీరు అవుతుంది. స్థానిక ఎమ్మెల్యే, కేంద్రమంత్రి స్పందించి అబుదాబి నుంచి తన భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

జూదరుల అరెస్టు

కవిటి: మండలంలోని కపాసుకుద్దికి సమీపంలో శనివారం రాత్రి పేకాడుతున్న కె.కపాసుకుద్దికి చెందిన నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రవివర్మ తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఈ దాడిలో రూ.2,010లు స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నాటుసారాతో ముగ్గురు అరెస్టు

మందస: మండలంలోని దేవుపురం కూడలి వద్ద నాటుసారాతో ముగ్గురిని ఆదివారం అరెస్టు చేశామని సోంపేట ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ తెలిపారు. ఒడిశారాష్ట్రం నుంచి నాటుసారాను ఆటోలో రవాణా అవుతున్న సమాచారం రావడంతో సిబ్బంది తో దాడులు చేశామన్నారు. ఆటోలో తనిఖీ చేయగా రెండు ప్లాస్టిక్ గోనె సంచుల్లో 50 లీటర్లు నాటుసారా ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలి పారు. పిడి మందసకు కడ్డాల రాజారావు, ఇప్పిలి ఉమా మహేశ్, అగ్గున నారాయణరావులను అరెస్టు చేసి సోంపేట కోర్టులో హాజరు పర్చామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జగన్నాథ్, సిబ్బంది గుణాకర్, మార్కా రావు, భాను, అరుణ్, ఉమాపతి పాల్గొన్నారు.


నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వ్యాయామ ఉపాధ్యాయులు గుర్తింపు తెచ్చుకోవాలి

ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సాంబమూర్తి

ప్రజాశక్తి- పలాస

వ్యాయామ ఉపాధ్యాయులు పనిద్వారానే గుర్తింపు తెచ్చుకోవాలని ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి అన్నారు. పలాస ఉన్నత పాఠశాలలో జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు పి.తవిటయ్య అధ్యక్షతన ఆదివారం సుదీర్ఘ కాలం వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘానికి వివిధ స్థాయిల్లో సేవలందించిన విశ్రాంత వ్యాయామ విద్య ఉపాధ్యాయులు మెంటాడ సాంబమూర్తి దంపతులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయామ విద్య ఒక ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పాఠశాలల్లో నెలకొల్పడానికి, విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన మెండుగా పెంపొందించడానికి క్రమశిక్షణ అలవర్చుకోవడానికి వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు కృషి ఎంతగానో



మాట్లాడుతున్న సాంబమూర్తి

అవసరమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షుడు యెన్ని శేఖర్‌బాబు, ఫస్ట్ జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.పద్మనాభరెడ్డి, పి.గజేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామారావు, జిల్లా అదనపు కార్యదర్శి సిహెచ్.పద్మలోచనం, టెక్కలి జోన్ సెక్రెటరీ కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

ఆపద అంటే.. ఆదుకుంటున్నారు



కోటబొమ్మాళి : చెక్కును అందజేస్తున్న గ్రామ పెద్దలు

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో ఉన్నాం ఆపన్న హస్తం అందించండి.. అంటూ అర్థించడమే తరువై దయార్ద్ర హృదయాలు స్పందిస్తున్నాయి. బాధితులకు అండగా నిలుస్తున్నాయి. ఆ కోవలోనే మండలంలోని పొందూరుపుట్టుగకు చెందిన రోడ్డు ప్రమాద బాధితులు రామ్మూర్తి, ప్రణయ్‌లకు దాతలు అండగా నిలుస్తున్నారు. ఇచ్ఛాపురంలోని శ్రీశయన యువత రూ.13వేలు, గొండ్యాలపుట్టుగ శ్రీశయన యువత రూ.46వేలు, ట్రూ హాండ్స్ సేవా ఫౌండేషన్ రూ.10 వేలు, కుసుంపురానికి చెందిన మాతృమూర్తి యువజన సేవా సంఘం రూ.6 వేలు బాధితులకు ఆదివారం అందించాయి. ఈ సందర్భంగా ట్రూ హాండ్స్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణంరాజు క్షతగాత్రులను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీయన సంఘం యువత, ట్రూ హాండ్స్ సేవా ఫౌండేషన్ సభ్యులు సింహాచలం, పురుషోత్తం, కేశవరావు, జగన్నాథ్ బెహరా, కిరణ్, వీరేష్, సోంపేట వరుణ్ మారుతి బ్రాంచ్ మేనేజర్ దాస రాజు, హరికృష్ణ, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2.63 లక్షలు...

కోటబొమ్మాళి : మండలంలోని చలమయ్యపేటకు చెందిన సైన వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.2.63.000ల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. పాలపోలమ్మతల్లి కమిటీ సభ్యులు రూ.2.33 లక్షలు, అలాగే కొన్ని గ్రామాల నుంచి రూ.30 వేలు విరాళాలు స్వీకరించి మొత్తం రూ.2.63 లక్షలు వెంకట్ కుటుంబానికి గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు.

ఎండలోనే ఆదిత్యుని దర్శనాలు

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో కార్తీక మొదటి ఆదివారం సందర్భంగా ఆదిత్య దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది యాత్రికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. ఉచిత దర్శనాల క్యూలైన్ల దగ్గర టెంట్లు వేయకపోవడంతో యాత్రికులు గంటల కొద్ది ఎండలోనే ఉండి ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది. కేశఖండన శాల వద్ద కూడా అరకొర సౌకర్యాలతో ఇబ్బంది పడ్డారు. టిక్కెట్లు తీసుకొని వెళ్లేవారి కంటే విఐపి పేరు చెప్పి చాలామంది నేరుగా దర్శనాలకు వెళ్లడం కనిపించింది. ఆదిత్య ఆలయ ప్రాంగణంలో డాక్టర్ అమ్మనాయుడు ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు.



ఎండలోనే క్యూలైన్‌లో ఉన్న యాత్రికులు

యాత్రికులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. ఇదిలా ఉండగా ఆదిత్యుని ఆదాయం రూ.9 లక్షల 64 వేల 750 వచ్చినట్లు ఆలయ ఇఒ కె.ఎన్.వి.డి.వి ప్రసాద్ తెలిపారు. స్వామివారి టిక్కెట్ల ద్వారా రూ.6 లక్షల4వేల 500, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2 లక్షల 85 వేల 750, విరాళాల ద్వారా రూ.74 వేల 508 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఎండల మల్లన్న ఆలయం సిద్ధం



ఎండల మల్లన్న ఆలయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కార్తీక మాసం నాలుగు సోమవారాలకు మండలంలోని రావివలసలో ఉన్న ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయం సిద్ధమైంది. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి యాత్రికులు వస్తుంటారు. శ్రీకాకుళం నగరానికి 55 కిలోమీటర్లు దూరంలో గల రావివలస చేరుకునేందుకు రవాణా సదుపాయం ఉంది. టెక్కలికి కూతవేటు దూరంలో ఉండే ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు సైతం నడుస్తుంటాయి. ఆలయానికి సుమారు కిలో మీటరు నడిచి చేరుకోవాల్సి ఉంటుంది. కార్తీక మాసం ఉత్సవాలకు ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిఐ అంబటి విజయకుమార్, నేతృత్వంలో బందోబస్తు ప్రణాళిక రూపొందించారు. క్యూలైన్లు తాగునీటి సదుపాయం ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.గురునాథరావు ఏర్పాటు చేశారు. పారిశుధ్యం, జంగిల్ క్లియరెన్స్ పనులు కార్యదర్శి పి.రవి పర్యవేక్షణలో చేపట్టారు. అలాగే ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయానికి రోడ్డు, రైలు సదుపాయం ఉంది. జిల్లా కేంద్రానికి 55 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంటుంది. టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, పలాస వెళ్లే బస్సుల్లో చేరుకోవచ్చు. టెక్కలి కాంప్లెక్స్‌లో దిగితే అక్కడ నుంచి పల్లెవెలుగు సర్వీసులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. సుదూర ప్రాంత ప్రయాణికులు రైళ్లలో సైతం చేరుకోవచ్చు. ఒడిశాలోని గజపతి, రాయగడ జిల్లాల నుంచి వచ్చేవారు. నేరుగా టెక్కలిలో దిగాలి. విశాఖ, విజయనగరం నుంచి వచ్చిన నౌపడ కూడలిలో దిగి రోడ్డులో మార్గంలో రావాలి.

టెట్ పరీక్ష అవమానకరం

వజ్రపుకొత్తూరు: సర్వీసులో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ పూర్తి చేయాలని ప్రభుత్వం గుదిబండ మోపడం సీనియర్ ఉపాధ్యాయులను అవమాన పరచడమేనని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రివ్యూ పిటీషన్ దాఖలు చేయకుండా హడావుడిగా టెట్ నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమన్నారు. టెట్ నోటిఫికేషన్ తక్షణమే నిలుపుదల చేయాలని, కూటమి ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని విద్యా హక్కు చట్టం 2009 లోని సెక్షన్-23ని సవరించే విధంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ పంపిణీ ప్రారంభం

లావేరు: మండలంలోని రేషన్‌డిపోల్లో నవంబర్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. గత వైసిపి ప్రభుత్వం ఎండియు వాహనాల ద్వారా కార్డుదారుల ఇళ్లకే వెళ్లి సరుకులు అందించేవారు. కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి పాతపద్ధతిలోనే డిపోలకు వెళ్లి డీలర్ వద్ద నుంచే సరుకులు తెచ్చుకునే విధానాన్ని తీసుకు రావడంతో వికలాంగులు, 65 ఏళ్ల పైబడిన వారికి వారి ఇంటివద్దకే డీలర్లు వెళ్లి సరుకులు డోర్ డెలవరీ చేసే విధానాన్ని తీసుకురావడంతో కార్డుదారుల ఇంటికెళ్లి ఇస్తున్నారు. మండలంలోని అన్ని డిపోల్లో సరుకులు పంపిణీ ఆదివారం ప్రారంభించారు.

ఇచ్ఛాపురం వరకు వంశధార కాలువ పొడిగించాలి

మందస : ఇచ్ఛాపురం వరకు వంశధార కాలువ పొడిగించాలని వంశధార సాగునీటి సాధన కమిటీ అధ్యక్షులు మన్మథరావు కోరారు. ఈ మేరకు మండలంలోని హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యక్షులు డి.వెంకటరావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావు చౌదరి, ఉగిరిపల్లి సోమ నాథం, కొప్పూరు దశరథి, వాయిలపల్లి వరప్రసాదరావు, పెద్దింటి శశిధర్‌వర్మ, దాసరి పున్నయ్య పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న ప్రసాదరావు

ప్రసాదరావుకు తెలుగుతేజం పురస్కారం

ప్రజాశక్తి- అరసవల్లి

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఐఎన్‌డి ప్రసాదరావు తెలుగుతేజం పురస్కారం ఆదివారం అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ మహిళా అధ్యక్షులు ఈశ్వరి భూషణం ఆధ్వర్యంలో 158వ శతకవి సమ్మేళనంలో ఐఎన్‌డి ప్రసాదరావుకు తెలుగుతేజం పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు రచయితల వేదిక సభ్యులు ఆర్.వి.రమణమూర్తి, యు.నాగేశ్వరరావులు అభినందనలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో దాతల సహాయంతో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు అండగా నిలుస్తున్నారు. ఆలయ గాలి గోపురం నిర్మాణం నిమిత్తం కవిటికి చెందిన ఉపాధ్యాయులు బాలక శ్రీనివాసరావు రూ.10వేలు, తెప్పల రవి రూ.10 వేలు, గార రాంబాబు రూ.5,016, కానిస్టేబుల్ తామడ ఉమ రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బి.పి.రెడ్డి, మొగలిపురి సీతారాం, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి రుద్రయ్య, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు, నీలపు చంద్రయ్య, గొరకల రామారావు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశపై అవగాహన

టెక్కలి : కౌమార దశలో ఉన్న బాలికలు తమ శారీరక మానసిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని గైనకాలజిస్టు వైద్యులు ఆర్.అరవింద్, ధనలక్ష్మిలు అన్నారు. స్థానిక గిరిజన బాలికల పోస్టుమెట్రిక్ వసతిగృహంలో ఆదివారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ చేసుకోవాలని కోరారు. బాలికలు కౌమార దశలో జరిగే మార్పులను అవగతం చేసుకోవాలన్నారు. తద్వారా తమ జీవితాన్ని చక్కదిద్దుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య కార్డులో అందజేశారు. విశ్రాంత ఉప విద్యాశాఖ అధికారి వల్లభ మల్లయ్య వివిధ అంశాలపై బాలికలకు అవగాహన చేపట్టారు. ప్రసూతి వైద్యుల సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమంలో వసతిగృహ మ్యాట్రిన్ డి.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

ప్రకాశనగర్ కాలనీలో కార్డాన్‌సెర్చ్

కోటబొమ్మాళి : స్థానిక మేజరు పంచాయతీ పరిధిలోని ప్రకాశనగర్ కాలనీలో ఆదివారం ఉదయం స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద ప్రాంతాలను తనిఖీలు నిర్వహించి, పలు వాహనాలను పరిశీలించారు. ఎలాంటి పత్రాలు లేని 96 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాలనీ యువకులతో మాట్లాడుతూ తమ ద్విచక్ర వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉంచుకోవాలన్నారు. హెల్మెట్ తప్పని సరిగా వినియోగించాలన్నారు.

ప్రాథమికస్థాయి నుంచి శతకాలు నేర్చుకోవాలి

లావేరు: ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచి శతకాలు నేర్చుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులతో శతకాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన శతకాలు చెబుతూ వేమన శతకం, భాస్కర శతకం, కుమారీ శతకం, సుమతి శతకం తదితర శతకాలను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది విద్యార్థులకు ఈ శతకాలు తెలియడం లేదన్నారు. అలాగే తెలుగు సంవత్సరాలు, నెలలు, తిది, వార, నక్షత్రాలు కోసం తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ కాంతారావు

ఆధునిక పరిజ్ఞానంతో నేరాలకు చెక్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు చెక్ పెట్టవచ్చునని ఎస్ఐ సీపాన కాంతారావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వహిస్తున్న పాత్ర ప్రస్తుత కాలంలో పోలీసింగ్ విధానాల మార్పులు, సమాజంలో పోలీసులు ప్రజలకు మరింత చేరువయ్యే విధానాలు అనే అంశాలపై ఆయన విద్యార్థులకు వివరించారు. యువతలో చట్టాలపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ -3 సూర్యనారాయణ, ట్రైనీ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.